సాక్షి
పల్నాడు
శుక్రవారం । 28 । జూన్ । 2024



ఈవీఎం గోడౌన్ పరిశీలన

నరసరావుపేట: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ గురువారం మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.



విరాళం అందజేత

కోడూరు: నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి జయపురం గ్రామానికి చెందిన గోగినేని సోమశేఖరరావు, లక్ష్మీపార్వతి దంపతులు రూ.1,01,116 నగదు విరాళంగా అందించారు.



నాసా కాంటెస్ట్‌లో ప్రతిభ

మచిలీపట్నంటౌన్: స్థానిక భాస్కరపురం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు నాసా కాంటెస్ట్‌లో జాతీయ స్థాయి ప్రథమ బహుమతిని పొందినట్లు ప్రిన్సిపాల్ ఒడుగు శంకరరావు తెలిపారు.

కౌలు కార్డులు అందేనా..?

- నత్తనడకన కౌలురైతుల గుర్తింపు
- ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా సగం మందికి కూడా అందని కార్డులు
- జిల్లాలో జూలై 3తో ముగియనున్న కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: జిల్లాలో కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది కౌలు రైతులకు అందించే పంట సాగుహక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్సీ) అందుతాయో లేదో అన్న బెంగ కౌలు రైతులను వెంటాడుతోంది. సీసీఆర్సీ కార్డులు లేకపోతే ప్రయోజనాలు అందవని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు అన్ని విధాల మేలు జరిగింది. వారికి సీసీఆర్సీ కార్డులు అందజేయడంతో పాటు విత్తనాలు, ఎరువులు కూడా అందించింది. అంతేకాకుండా సాధారణ రైతులకు ఇచ్చిన విధంగా వారికి వైఎస్సార్ రైతు భరోసా పథకం ఆర్థిక సాయం అందించింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గత ప్రభుత్వం జిల్లాలోని 53,608 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేసింది. ఈ ఏడాది 65 వేల మందికి కార్డులు అందజేయాలని కొత్త ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే ఇంతవరకు కేవలం 5,281 మందికి మాత్రమే పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్సీ కార్డులు) అందాయి. ఇంకా 59,719 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. రైతులు కొన్నిచోట్ల పంటల సాగుకు ఉపక్రమించగా, మరికొన్నిచోట్ల పొలాలను సిద్ధం చేస్తున్నారు. సీసీఆర్సీ కార్డుల జారీలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. వచ్చే నెల 3వ తేదీతో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న కౌలు రైతుల అవగాహనా గ్రామ సభలు ముగియనున్నాయి. సీసీఆర్సీ కార్డులు అసలు అందుతాయా? లేదా? అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు పెట్టుబడి భరోసా నిధులు కూడా విడుదల చేయకపోవడంతో రైతులు, కౌలు రైతులకు కష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు.



సత్తెనపల్లిలో కౌలు రైతు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న వీఏఏ ప్రశాంత్

అపోహలు తొలగించేందుకు గ్రామ సభలు..

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందించడం వలన రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 15 రోజుల క్రితం గ్రామసభలు ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 3వ తేదీతో ముగియనున్నాయి. గ్రామ సభల్లో రైతుల సందేహాలు నివృత్తి చేసి కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. ఆందోళన చెందాల్సిన పని లేదు. సీసీఆర్సీ కార్డులు లక్ష్యాన్ని చేరుకుని వేగవంతంగా అందిస్తాం.

–ఐ.మురళి,
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పల్నాడు

రాయితీలు హుళక్కేనా?!

- పంట నమోదు కోసం రైతుల నిరీక్షణ
- వెబ్‌ల్యాండ్‌లో నమోదైతేనే రాయితీలు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కానరాని నమోదు ప్రక్రియ
- కొత్త ప్రభుత్వం మార్గదర్శకాల కోసం రైతుల ఎదురు చూపులు

సత్తెనపల్లి: రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్ కాపీలు తీసుకువచ్చి ఇస్తే సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, పచ్చిరొట్ట విత్తనాలు వంటివి వ్యవసాయ శాఖ అధికారులు గతంలో పంపిణీ చేసేవారు. అయితే ఈ ఏడాది నుంచి వెబ్‌ల్యాండ్‌లో పంట వివరాల నమోదు ఆధారంగా రైతులకు విత్తనాల నుంచి యంత్ర పరికరాల వరకు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రైతులు పొలాలతో కూడిన వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. అలా నమోదైన పొలాలకు సంబంధించిన రైతులకు మాత్రమే ఆయా పథకాల రాయితీలు అందుతాయి. అయితే ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమవడం.. ఇప్పటికీ ప్రభుత్వం నమోదు ప్రక్రియ ప్రారంభించకపోవడం.. దానికి సంబంధించిన మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో రాయితీలపై ఆశలు వదులుకోవాల్సిందేనా అన్న అనుమానం రైతులు వ్యక్తం చేస్తున్నారు.

డి–క్రిషిలో మొత్తం వివరాలు...

ప్రస్తుతం వ్యవసాయ శాఖ సాంకేతికతను వినియోగిస్తూ సబ్సిడీపై అన్నిరకాల విత్తనాలను రైతులకు అందించే ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు డి–క్రిషి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వెబ్‌సైట్‌లో రైతు ఆధార్ కార్డు నంబరు ఎంటర్ చెయ్యగానే ఆ రైతుకు సంబంధించిన పొలం వివరాలు మొత్తం వస్తాయి. అలా కాకుంటే ఎంత పొలం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ రాయితీలకు అనర్హులుగా పరిగణిస్తారు. రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో డి–క్రిషి వెబ్‌సైట్‌లో పంటల వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

సాధారణ సాగు 1,16,412 ఎకరాలు..

సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో సాధారణ సాగు 1,16,412 ఎకరాలుగా ఉంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు పంటల సాగు లక్ష్యంగా ప్రణాళి కలు సిద్ధం చేశారు. వరి, పత్తి, మిర్చితో పాటు ఇతర పంటలు పండించేలా రైతులు సిద్ధమవుతున్నారు.

డి–క్రిషిలో నమోదు తప్పనిసరి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం నుంచి రాయితీలు పొందాలంటే రైతులు డి–క్రిషి వెబ్‌సైట్‌లో వారి వివరాలు నమోదు చేసుకోవాలి. పంటలు నమోదుకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చిన వెంటనే నమోదు కార్యక్రమం చేపడతాం. ప్రస్తుతం ఆర్బీకేల్లో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ పూర్తి చేశాం.

– ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి

నిత్యావసరాల పంపిణీ సక్రమంగా ఉండాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



సత్తెనపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెల పేదలకు అందించే నిత్యావసర సరుకుల్లో అవకతవకలు, అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్టవేసేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని ఎంఎల్ఎస్ పాయింటును గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా జూలై నెలకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరుకులను చౌక ధరల దుకాణాలకు చేరవేయడం ఇప్పటికే మొదలు పెట్టి ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సి ఉండటంతో ఎంతవరకు పూర్తయింది అనేవిషయాన్ని జేసీ స్వయంగా పరిశీలించారు. ప్రతినెలా సక్రమంగా బియ్యం పంపిణీ జరగాలన్నారు. స్టేజ్–2 ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. పౌరసరఫరాల శాఖా జిల్లా మేనేజర్ వరలక్ష్మి, సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి వి.మురళీకృష్ణ, తహసీల్దార్ సీహెచ్ ఉష, పౌరసరఫరాల డీటీ అరుణ, తదితరులు ఉన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీలో 76.51శాతం ఉత్తీర్ణత

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఎ.హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో పరీక్షకు 4,564మంది విద్యార్థులు హాజరు కాగా 3,492మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. పల్నాడుజిల్లా 76.51 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో 11వస్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను ఏపీ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ www.bre.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు మార్కుల మెమోలు ఉపయోగపడతాయన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికి నిర్ణీత సమయంలోనే సర్టిఫికెట్లు అందజేస్తామని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు తమ ఫలితాలపై ఈనెల 27వతేదీ నుంచి జూలై 1వతేదీ రాత్రి 11గంటల వరకు ఆన్‌లైన్‌లో రీకౌంటింగ్, రీ వెరిఫికెషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి వారికి నిర్ణీత ఫీజు చెల్లించి హెచ్ఎంల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలని వివరించారు.

మంగళగిరిలో 24.2 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు పలుచోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా మంగళగిరి మండలంలో 24.2 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 4.8 మి.మీ వర్షం పడింది. సగటున 15 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా గుంటూరు పశ్చిమ 22.2 మి.మీ., తాడికొండ 22, తాడేపల్లి 19.6, దుగ్గిరాల 18.6, తుళ్ళూరు 18.6, తెనాలి 18.4, కొల్లిపర 17.4, ఫిరంగిపురం 15.8, పెదకాకాని 15.6, పొన్నూరు 15.2, గుంటూరు తూర్పు 13.4, కాకుమాను 10, మేడికొండూరు 9.6, చేబ్రోలు 9.4, పెదనందిపాడు 8.2, ప్రత్తిపాడు మండలంలో 6.8 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ మాసం 27వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 87.4 మి.మీ నమోదుకావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 106.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

యార్డులో 38,931 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,128 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,931 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,615 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేంజ్‌లో పలువురు ఎస్ఐలకు జిల్లాలు కేటాయింపు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లోని ఎస్ఐలను ఆయా జిల్లాలకు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలలో భాగంగా రేంజ్‌లోని పలువురు ఎస్ఐలను ఎన్నికల కమిషన్ (ఈసీ) బదిలీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో గుంటూరు జిల్లా–15, పల్నాడు జిల్లా–7, బాపట్ల –7, ప్రకాశం జిల్లా– 20, శ్రీపొట్టిశ్రీరాములనెల్లూరు జిల్లా –13, తిరుపతి జిల్లా – 6 మంది ఎస్ఐలు బదిలీయ్యారు.

నులకపేట–బ్రహ్మానందపురం రైలు గేటు మూసివేత

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మంగళగిరి–కృష్ణా కెనాల్ మధ్య నులకపేట బ్రహ్మానందపురం మధ్య లెవెల్ క్రాసింగ్ గేటును ఈనెల 28న ఉదయం 7 గంటల నుంచి ఈనెల 30 సాయంత్రం 7 గంటల వరకు మూసి వేయనున్నట్టు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఓవర్ హాలింగ్ రోడ్డు మరమ్మతుల కోసం గేటు మూసి వేయనున్నట్లు వివరించారు.

వినుకొండలో తీవ్ర విషాదం

- ఒకేరోజు మూడు వరుస ప్రమాదాలు
- మూడు కుటుంబాల్లో తీరని శోకం
- రక్తసిక్తమైన కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి
- ప్రాణాలను హరిస్తున్న రోడ్డు ప్రమాదాలు





తండ్రికొడుకుల మృతికి కారణమైన లారీ, వారి బైక్

వినుకొండ(నూజెండ్ల): నిదానమే ప్రధానమన్నది పెద్దల మాట. కానీ ఇవాళ చోదకులు దాన్ని అస్సలు పట్టించుకునే స్థితిలో లేరు. తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకోవాలనే తాపత్రయం.. ఎక్కువ దూరం ప్రయాణం చేయడం వల్ల ఏర్పడిన అలసట, నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వారిమీద ఆధారపడిన కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున వినుకొండ ప్రాంతంలో జరిగిన మూడు వరుస ప్రమాదాలను గమనిస్తే కేవలం చిన్నపాటి నిర్లక్ష్యమే ఆరుగురి ప్రాణాలు తీసిందన్నది అర్థమవుతోంది. ఈ ప్రమాదాలు మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి.

- చక్కగా దైవదర్శనాలు పూర్తి చేసుకుని మరో రెండు గంటల్లో తమ గమ్యస్థానానికి చేరుకోవాల్సిన ఓ కుటుంబ సభ్యుల వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో పురాణ పండితునిగా పేరుగడించి పదవీ విరమణ చేసి గుంటూరులో నివాసం ఉంటున్న సోమాసి బాల గంగాధర శాస్త్రి ఆయన భార్య యశోదతోపాటు కారు నడుపుతున్న డ్రైవరు కూడా ఘటనలో మృత్యువాత పడ్డారు. డ్రైవరు నిద్రమత్తు వల్లే వాహనం అదుపు తప్పి చివరకు అతని ప్రాణాలతోపాటు దంపతుల ఉసురు తీసింది.
- ఈ ప్రమాద స్థలానికి దగ్గరలోనే అతి వేగంగా వచ్చిన లారీ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రకాశం జిల్లా ఉమ్మడివరం గ్రామానికి చెందిన తండ్రికొడుకులు మాలెపాటి పెద రామకోటేశ్వరరావు, ఆయన చిన్నకుమారుడు అంజిబాబులు అశువులు బాశారు. వీరిని లారీ మృత్యువు రూపంలో వెంటాడటం బాధాకరం.
- మరో ఘటనలో నూజెండ్ల మండలం పాతనాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడు మీరావలిని మినీలారీ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు రహదారిపైనే మృతిచెంది కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు.

నెత్తురోడుతున్న రహదారి..

గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఏడాది వ్యవధిలోనే పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేసినప్పటికీ రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతుండటం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారింది.

ముఖ్యంగా జాతీయ రహదారి నుంచి శివాపురం నడిగడ్డ వెళ్లే మార్గం వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే చీకటీగలపాలెం వై.జంక్షన్, కొత్తపాలెం వద్ద మూల మలుపులు, మార్కాపురం రోడ్డులోని పసుపులేరు మూలమలుపు వద్ద ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంది.

ఈ మార్గంలో రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించడం, ప్రమాదాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించి, ప్రమాదాల నివారణకు జిల్లాపోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్

నరసరావుపేట: జిల్లాలో జూలై ఒకటో తేదీన ప్రభుత్వ నిబంధనల మేరకు సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు చేపట్టాలని మండల, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అధికారులు, డీఎల్‌డీఓలు, ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,82,126 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వారికి సంబంధించి రెగ్యులర్ పింఛన్ల కింద రూ.120కోట్లు, అరియర్స్ కింద మరో రూ.71కోట్లు ఆయా బ్యాంక్‌లలో ఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై ఒకటిన పెన్షన్ల పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్ డ్రా చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆదివారం కూడా నిధులు డ్రా చేసుకునే విధంగా సంబంధిత బ్యాంకర్లతో కలసి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో సచివాలయ సిబ్బందికి 50 హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ చేపట్టాల్సి ఉందని, శుక్రవారం లోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట అదనపు సిబ్బందిని వివిధ వివిధ శాఖల నుంచి డెప్యూట్ చేసుకొని పింఛన్ల పంపిణి చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి రసీదులు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత రెండు నెలలు పెన్షన్ల పంపిణీ శాంతియుతంగా చేపట్టడం జరిగిందన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం మండల స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండాలని సూచించారు. పెన్షన్ల పంపిణీ విజయవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీకి అవసరమైన సిబ్బంది వివరాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రానికి అన్ని వివరాలు ఉండాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి పాల్గొన్నారు.

కారెంపూడిలో ప్రబలిన డయేరియా

- రెండు రోజుల్లో పదిమంది వ్యాధిబారిన..
- వడ్డెర బజారులో ప్రత్యేక వైద్యశిబిరం
- రోగులను పరామర్శించిన డీఎంహెచ్ఓ

కారెంపూడి: స్థానిక వడ్డెర బజారులో డయేరియా ప్రబలింది. గత రెండు రోజులుగా 10 మంది వ్యాధి బారిన పడ్డారని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం తెలిపారు. ఇద్దరు గుంటూరు జీజీహెచ్‌లో, ముగ్గురు కారెంపూడి పీహెచ్‌సీలో, పిడుగురాళ్ల, కారెంపూడిలో ప్రైవేటు హాస్పటల్స్‌లో మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి గురువారం వడ్డెర బజారులో పర్యటించి డయేరియా ప్రబలడానికి కారణాలను పరిశీలించారు. ఇప్పటికి పది మంది వాంతులు, విరేచనాలతో డయేరియా బారిన పడ్డారని డీఎంహెచ్ఓ రవి తెలిపారు. బుధ, గురువారాల్లో రెండు రోజుల్లో పది కేసులు వచ్చాయన్నారు. అందరూ చికిత్స పొందుతున్నారని తెలిపారు. 24 గంటలు ఉండేవిధంగా ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. కలుషిత నీరు తాగడం వల్లే డయేరియా ప్రబలిందని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. తాగే నీటి విషయమై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తిన వద్దని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు. డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ లక్ష్మీ మౌనిక, డాక్టర్ రమ్య, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలందిస్తున్నారు. ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, జిల్లా ఎపిడమిక్ టీమ్ డయేరియా ప్రబలిన వడ్డెర బజారులో పర్యటించారు. శానిటైజేషన్, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయడం లాంటి చర్యలు చేపట్టారు. వివిధ అనారోగ్య సమస్యలతో వైద్య శిబిరానికి వచ్చినవారికి వైద్య శిబిరంలో వైద్యులు సేవలందిస్తున్నారు.



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి

వడ్డెర బజారులో ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ పర్యటన

కారెంపూడి: కారెంపూడిలో అతిసార ప్రబలిన వడ్డెర బజారులో ఆర్‌డబ్ల్యూఎస్ స్టేట్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సుందరరాజు గురువారం పర్యటించారు. డయేరియా బారిన పడినవారి ఇళ్లకు వెళ్లి విచారించారు. వర్షాలకు కలుషిత నీరు బోర్లలోకి చేరే అవకాశం ఉందని, ఆ నీటిని వంటకు వినియోగించవద్దని సూచించారు. నాలుగు చోట్ల వాటర్ పైపు లైన్‌లో లీకేజీలు వస్తున్న విషయాన్ని గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు.

పది బోర్ల నుంచి అధికారులు వాటర్ శాంపిల్స్‌ను సేకరించారు. వీటిని గుంటూరు ల్యాబ్‌కు పంపి పరీక్షచేయిస్తామని, అప్పటివరకు నీటి వాడకంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్లతో మాట్లాడారు. ఆయనవెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, స్వచ్ఛాంధ్ర మండల కో–ఆర్డినేటర్ కె.సుబ్బారావు ఉన్నారు.



ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న చీఫ్ ఇంజనీర్ సుందరరాజు



క్లుప్తంగా

30న జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వతేదీ ఆదివారం సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్‌పూల్ వద్ద ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో 11 నుంచి 17 సంవత్సరాల లోపు గల బాలబాలికలు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 29వతేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూలై 14, 15తేదీలలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరగనున్న 9వ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యత్వం కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 8296374963 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా డాక్టర్ లక్కిరెడ్డి



నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. గురువారం ఆయనను టీడీపీ నాయకులు నార్ల మారుతీబాబు, ఇండ్లమూరి మస్తాన్‌రావు, ఆవుల రమణ, డీబీహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ దుశ్శాలువా కప్పి పూలదండలతో సత్కరించి అభినందించారు.

ఓడిపోయిన పార్టీల నేతలపై దాడులు మంచి పద్ధతి కాదు

ప్రజా సంఘాల నేతలు

పిడుగురాళ్ల: ఓడిపోయిన పార్టీల నాయకులపై దాడులు చేయటం సరైన పద్ధతి కాదని ప్రజా సంఘాల నేతలు అన్నారు. పట్టణంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.... గతంలో ఎప్పుడు లేని విధంగా ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులపై గెలిచినవారు గొడవలకు దిగటం, గ్రామాలను ఖాళీ చేయించటం మంచి పద్ధతి కాదన్నారు. అది దుస్సంప్రదాయమన్నారు. పొలాలను సైతం దున్నుకోనివ్వకుండా దాడులు చేయటం సరికాదని వారు తెలియజేశారు. ఈ సమావేశంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షుడు ఓర్సు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువే భూములకు ఆరోగ్యరక్ష

- తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు
- భూములలో రసాయన సమతుల్యం మెరుగు
- అమరావతి పరిశోధన స్థానంలో అందుబాటులో ఎరువులు

అమరావతి: ప్రస్తుతం వ్యవసాయ రంగంలో జీవన ఎరువుల ప్రాధాన్యం పెరిగింది. పంటభూములలో సహజంగా ఉండే మిత్ర సూక్ష్మజీవ సంపదను కాపాడుకుంటూ భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా ఐదు రకాల జీవన ఎరువులను ఘన, ద్రవరూపాలలో రైతులకు అందిస్తున్నారు. జీవన ఎరువులను రైతులకు అందించటంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నేతృత్వంలో జీవన ఎరువుల తయారీలో అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారు. అనుబంధంగా అనకాపల్లి, అనంతపురం, కడప, తదితర ప్రాంతాలలో పరిశోధన స్థానాలు ఏర్పాటు చేశారు.



వ్యవసాయ పరిశోధన స్థానం భవనం



సిద్ధంగా ఉన్న ఘన, ద్రవ జీవన ఎరువులు

జీవన ఎరువుల ఉపయోగాలు

వ్యవసాయంలో అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూమిలో, ఉపరితలం పైనా పర్యావరణ కాలుష్యం ఏర్పడి రైతులకు పెట్టుబడి అధికమవుతుంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువులు, జీవన ఎరువుల వాడకం కూడా తగ్గుముఖం పడుతున్నందువల్ల భూమిలో రైతుకు మేలు చేసే సూక్ష్మాంగ జీవులు తగ్గి మొక్కకు పోషక పదార్థాలు, హార్మోన్‌లను సమకూర్చే వీలు లేకుండా పోతుంది. జీవన ఎరువులు వాడటం వల్ల మొక్కకు అనుగుణమైన మార్పులు జరిగి రైతుకు మేలు చేసే మిత్ర సూక్ష్మజీవుల సంఖ్య అనూహ్యంగా పెరగటంతో మొక్కకు అవసరమైన వివిధ పోషకాలతోపాటు హార్మోన్లను, విటమిన్‌లను అందించేందుకు వీలు కలుగుతుంది. నత్రజనిని స్థిరీకరించే ఏడు రకాల జీవన ఎరువులలో అమరావతి వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఐదు రకాల జీవన ఎరువులను ద్రవ, ఘన రూపాలలో తయారు చేసి రైతులకు అందిస్తున్నారు. అందులో రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, ఫాస్ఫోబ్యాక్టీరియా, మైకోరైజావేమ్ లను రైతులకు తక్కువధరకు అందిస్తున్నారు.

రైజోబియం

అపరాల పంటలకు నత్రజని అందించు జీవన ఎరువుగా వాడాలి. పప్పుజాతి పైర్లలో కంది, పెసర, మినుము, శనగ, వంటి పైర్లకు, వేరు శనగ, సోయాచిక్కుడు వంటి నూనెగింజల పైర్లకు రైజోబియం కల్చర్‌ను విత్తనంకు పట్టించి ఉపయోగించాలి. దీనిని వల్ల మొక్క వేళ్లపై ఏర్పడిన లేత గులాబిరంగు బుడిపెలలో ఉన్న రైజోబియం గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తుంది. ఈ రైజోబియం కల్చర్ ఒక్కొక్క పంటకు ఒక్కొక్క ప్రత్యేకమైన స్ట్రెయిన్ ఉంటుంది. రైజోబియంను 100 మిల్లీ లీటర్ల నీటిలో 10 గ్రాముల పంచదార లేదా బెల్లం లేదా గంజి పౌడర్‌ను కలిపి 10 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. ఈ చల్లార్చిన ద్రావణం 10 కిలోల విత్తనాలపై చల్లి దానిపై 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టు పొరలా ఏర్పడే విధంగా చూడాలి. తరువాత విత్తనాన్ని 10 నిమిషాలు నీడలో ఆరబెట్టి పొలంలో నాటుకోవాలి.

అజటోబాక్టర్

పప్పుజాతి పంటలను మినహాయించి మిగతా అన్ని పంటలకు నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ బ్యాక్టీరియా నత్రజనిని స్థిరీకరించటమే కాక మొక్కకు కావాల్సిన హార్మోన్లను, విటమిన్లను అందిస్తుంది. దీని వల్ల ముఖ్యంగా సేంద్రియ కార్బనం ఎక్కువగా భూమిలో సమర్థంగా పనిచేస్తుంది. ఈ జీవన ఎరువును ఆకుకూరలు, కూరగాయలు, పూల తోటలలో అధికంగా వాడతారు. ఏ పంటకైనా ఒక కిలో కల్చర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి విత్తనం నాటే సమయంలో ఒక ఎకరాకు చల్లాలి. చల్లిన సమయంలోగాని, లేక వెనువెంటనే గాని భూమిలో తగినంత తేమ ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

అజోస్పైరిల్లమ్

గతంలో కంటే ఇటీవల కాలంలో అజోస్పైరిల్లమ్ ప్రాముఖ్యతను రైతులు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ అవకాశం ఉన్న చోట వేళ్లలో కూడా జీవిస్తాయి. ఈ కారణంగా ఈ జీవన ఎరువు స్థిరీకరించిన నత్రజని నేరుగా మొక్కకు అధికశాతం అందుబాటులో ఉంచుతుంది. ఈ జీవన ఎరువు పప్పుజాతి పంటలకు తప్పించి మిగిలిన పంటలకు వాడుకోవచ్చు. వరి, చెరకు, పత్తి, మిర్చి, జొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు, అరటి మొదలైన పంటలలో సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్నప్పటికి ఈ జీవన ఎరువు పనిచేస్తుంది. తక్కువ కాలపు పంటలకు ఒకకిలో అజోస్పైరిల్లమ్‌ను 80–100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఎకరం పొలంలో విత్తనం కిందపడేటట్లు చల్లాలి. నారుమడి వేసుకునే పంటలకు నారు పీకుటకు ముందుగా నారుమడి వద్ద 70 నుంచి 80 లీటర్లు పట్టే చిన్న మడి తయారు చేసుకుని ఆ నీటిలో ఒక కిలో అజోస్పైరిల్లాను బాగా కలిపి కలిపిన ద్రావణంలో పదినిమిషాలు వేళ్లను మాత్రమే ముంచి వెంటనే నాటుకోవచ్చు. చెరకు పంటలో నాటే విత్తనం చెరకు ముచ్చులను పది నిమిషాల పాటు ఈ ద్రావణంలో ముంచి నాటుకోవాలి.

ఫాస్ఫో బ్యాక్టీరియా

ఈ జీవన ఎరువు ముఖ్యంగా బాసిల్లస్ మెగథీరియంతో గాని, సూడోమోనాస్‌గాని ఉపయోగించి తయారు చేస్తారు. ఈ జీవన ఎరువు భూమిలోని మొక్కలకు లభ్యం గాని రూపంలో ఉన్న భాస్వరాన్ని, లభ్యమయ్యే రూపంలోకి మార్చును. అన్ని పంటలకు వాడుకోవచ్చు. ఈ జీవన ఎరువు సమర్థంగా పనిచేయుటకు సేంద్రియ కర్బనం అత్యవసరం. ఈ ఎరువుతో తప్పనిసరిగా సేంద్రియ ఎరువు వాడాలి. దీంతో అధిక పంట దిగుబడి సాధ్యం. ఎకరాకు ఒకటి నుంచి 1.5 కిలోల ఫాస్ఫోబాక్టర్, 200 కిలోల పశువుల ఎరువుతో కలపి దుక్కిలోగాని, మొక్క నాటినప్పుడు గాని సాళ్లలో పడేటట్లు వేసుకోవాలి. వరి విషయంలో నాట్లు వేసిన 3 నుంచి ఏడు రోజుల వ్యవధిలో వేసుకోవాల్సి ఉంటుంది. ఎరువులు వాడే సమయంలో పొలంలో తగినంత తేమ అవసరం.

మైకోరైజావేమ్

ఈ మైకోరైజాల్ ఇనాక్యులమ్‌ను ఏదైనా సేంద్రియ ఎరువుతో కలపి విత్తనం లేదామొక్క వేళ్లకు కింద పడునట్లు జాగ్రత్త తీసుకోవాలి. ఒక ఎకరం పొలానికి సుమారు ఐదు కిలోల కల్చర్‌ను వాడాల్సి ఉంటుంది. ఇది మొక్కకు కావాల్సిన భాస్వరాన్ని సమృద్ధిగా అందిస్తుంది. సూక్ష్మధాతువులైన జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్, కోబాల్ట్ మరియు మోలిబ్డినమ్ మొదలగు వాటిని ఉత్పత్తి చేస్తుంది.

వాడకంలో జాగ్రత్తలు

జీవన ఎరువు ప్యాకెట్లను వేడి తగలని నీడ ప్రదేశంలో నిల్వ ఉంచాలి. పంటకు సరైన జీవన ఎరువును ఎంపిక చేసుకోవాలి. గడువు తేదీని గమనించి జీవన ఎరువును వాడాలి. రసాయనాలతో విత్తనశుద్ధి చేసేటప్పుడు తప్పక 48 గంటల వ్యవధిలో వాడాలి. రసాయన ఎరువులతో కలిపి వాడరాదు. సేంద్రియ ఎరువుతో జీవన ఎరువును కలిపి వెంటనే పంటకు వాడుకోవాలి.

పంట నీటి ఎద్దడి నుంచి తట్టుకోవటానికి దోహద పడుతుంది. పంటను నులిపురుగులు మరియు రోగ నిరోధక శిలీంద్రముల నుంచి రక్షణ. భూమిలో సేంద్రియ కర్బనం పెరగటానికి ఉపయోగపడును. ఈ జీవన ఎరువు పాక్షిక స్టెరైల్ పద్ధతిలో లిగ్నైట్ మరియు మెత్తటి ఇసుక మిశ్రమంతో తయారు చేస్తారు. దీనిని ఎండ తగలని, నీడ ప్రదేశంలో నిల్వ చేయాలి. రసాయనిక ఎరువులతో కలిపి వాడరాదు. నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే వాడాలి.

> **సబ్సిడీ ధరకే జీవన ఎరువులు**
>
> రైతులకు అవసరమైన జీవన ఎరువులను సబ్సిడీ ధరలకే అందిస్తున్నాం. ఈ ఖరీఫ్, రబీ సీజన్‌లలో సుమారు ఏడు వేల లీటర్లకు పైగా ద్రవ జీవన ఎరువులు రైతులకు అందించాలని నిర్ణయించాం. వివరాలకు వ్యవసాయ పరిశోధనా స్థానం, అమరావతి–522020, గుంటూరు జిల్లా ఫోన్‌నెం.08645 255345లో సంప్రదించవచ్చు.
>
> –ఎం.శ్రీరేఖ, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త, అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం

ద్రవజీవన ఎరువులు

రాష్ట్రంలోనే ప్రత్యేకత కలిగిన అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ఉత్పత్తి చేస్తున్న జీవన ఎరువులు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుత ఈ పరిశోధనా స్థానం నుంచి మార్కెట్‌లో రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, ఫాస్ఫోబ్యాక్టీరియా, మైకోరైజావేమ్ అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ నుంచి పొడి రూపంలో అందించే ఈ జీవఎరువుల కాలపరిమితి 6 నెలలకు మించి నిల్వ ఉండే పరిస్థితి లేకపోవటంతో గతంలో కంటే నాణ్యంగాను, ఎక్కువకాలం నిల్వ ఉండేలా ద్రవరూపంలో అందిస్తున్నారు. ద్రవ జీవన ఎరువుల వలన రైతులకు అనేక లాభాలు ఉన్నాయని ద్రవజీవన ఎరువులు సంవత్సరం కాలంపాటు నిల్వ ఉండి అధికశాతం బ్యాక్టీరియాను గడువు తేదీ వరకు కలిగి ఉంటాయి.

వాడకం వల్ల ఉపయోగాలు ..

వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు, వాతావరణంలోను, నేలలోను మొక్కలు తమంత తాము ఉపయోగించు కోలేని పోషకాలను అందుబాటులోకి తెస్తాయి. హార్మోన్లు, విటమిన్లు మొక్కకు లభ్యమయ్యే పెరుగుదల వేగంగాను, ఆరోగ్యకరంగాను ఉంటాయి. నేలనుంచి సంక్రమించే తెగుళ్లను కొంత మేర నివారించ వచ్చు. నేల భౌతిక లక్షణాలు బాగుపడి భూసారం అభివృద్ధి చెందుతుంది. రైతులకు రసాయన ఎరువుల ఖర్చు తగ్గి లాభాల నిష్పత్తి పెరుగుతుంది. సాధారణ దిగుబడుల కంటే 10 నుంచి 20 శాతం వరకు దిగుబడులు పెరుగుతాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది.

రోకలి బండతో మోది భర్తను హత్య చేసిన భార్య

పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు

గురజాల: భర్తను రోకలి బండతో మోది భార్య హత్య చేసిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం.. గురజాల నగర పంచాయతీకి చెందిన షేక్ ఇస్మాయేలు, షేక్ నిదాన్‌బిలు భార్యభర్తలు. వీరివురి మధ్య వివాదం కారణంగా గత ఏడు సంవత్సరాల నుంచి విడిగా జీవనం సాగిస్తున్నారు. ముస్లిం పెద్దల సమక్షంలో గత ఏడేళ్లుగా నిదాన్‌బీ విడాకుల కోసం దరఖాస్తు చేస్తూనే ఉంది. ఈక్రమంలో నిదాన్‌బీ టైలర్ షాపు వద్దకు మద్యం తాగి షేక్ ఇస్మాయేలు వెళ్లి గొడవ చేశాడు. దీంతో విసిగిపోయిన నిదాన్‌బీ షాపు కట్టేసి ఇంటికి వెళ్లింది. వెంటవెళ్లిన ఇస్మాయేలు నిదాన్‌బీ జుట్టు పట్టుకుని లాగడంతో కిందపడింది. దీంతో పక్కనే ఉన్న రోకలిబండ తీసుకుని భర్త ఇస్మాయేలు తలపై కొట్టింది. వెంటనే ఇస్మాయేలు రక్తం కారుతూ కింద పడిపోయాడు. నిందితురాలు నిదాన్‌బీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనను చెప్పి లొంగిపోయింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న ఇస్మాయేలును గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా వైద్యులు పరిక్షించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలి

- కౌలు రైతులకూ పథకం వర్తింపజేయాలి
- సత్వరం విధివిధానాలు ప్రకటించాలి
- కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్

నరసరావుపేట: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలురైతులకు కూడా రూ.20వేలు సహాయం అందజేయాలని కౌలురైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన వాగ్దానాలలో పెట్టుబడి సాయం ఒకటి అన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఇచ్చే రూ.13,500లు రూ.20 వేలకు పెంచి రైతులందరికీ ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే ప్రస్తుతం పేరు మార్చి అన్నదాత సుఖీభవ పేరుతో సహాయం అందిస్తామని చెప్పారన్నారు. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన రూ.6వేలతో కలిపి రూ.13,500లు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ప్రచారం చేసిన టీడీపీ నాయకులు కేంద్ర సహాయం రూ.6వేలతో సంబంధం లేకుండా రూ.20వేలు పెట్టుబడి సాయం విధి విధానాలను ప్రకటించి వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కౌలురైతులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలురైతులకు కూడా అందిస్తామని వాగ్దానం చేశారన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని, భూమిలేని కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేసి వారందరినీ ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సాగుచేస్తున్న భూమిలేని కౌలురైతులందరికీ కేంద్ర సాయం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వ సాయం రూ.20 వేలు మొత్తం రూ.26వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ AP రాజధాని అమరావతి, హైకోర్టుకు 6కి.మీ వద్ద గ॥8000/-, నిడమర్రు, బాజా వద్ద గ॥ 12వేలు మంగళగిరి కమర్షియల్ ITమాల్500 Sft, 30ల॥,15వేలురెంట్, లోనుకలదు. 9603530555

■ గుంటూరు బుడంపాడు హైవే Vja రోడ్‌లో100 అపార్ట్‌మెంట్స్ 200 షాపింగ్ కాంప్లెక్స్ ప్రక్కన ప్లాట్లు 156గ॥,146గ॥,గ॥13000/- పవర్‌స్టేషన్ ప్రక్కన 3000గ॥, గ॥50000/-, పొన్నూరు రోడ్ లో గ॥4500/- సం॥9908685888

FLAT FOR SALE

■ వర్టెక్ నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వేగేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 40 లక్షలకే. ఫోన్ 98481 10543, 70936 09070.

PLOTS FOR SALE

■ గుంటూరు మార్కెట్ నుండి 12 km దూరంలో చింతలపల్లిపాడు గ్రామానికి ఆనుకొని ల్యాండ్ కన్వర్షన్ ప్లాట్స్ 111 గజాలు (25x40) 375000/- మాత్రమే. 9492939269, 8688530359

■ రాజధాని గుంటూరు విజయవాడలో 15 వెంచర్లలో CRDA ప్లాట్స్ పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్‌మెంట్స్ పొలాలు మీకు అందుబాటు ధరలలో కలవు. సంప్ర॥ ✆ 93904 51999

SERVICES

BUSINESS OFFER

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179

■ Korify Traders కంపెనీలో కేవలం అతి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే గొప్ప అవకాశం. డైలీ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ డోంట్ మిస్. ఫోన్ 9398996445

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

WANTED

■ Mandi Arabic రెస్టారెంట్, బ్రాడీపేట 3/1 నందు పనిచేయుటకు కిచెన్ హెల్పర్స్& స్టీవర్ట్స్ కావలెను. టైం : 11AM to 11PM. వ:18-30సం॥లోపు 9856585959, 9949977987

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోమ్ పని చేయుటకు మహిళలు కావలెను. జీతం: డైలీ పేమెంట్ కలదు. సంప్రదించగలరు. ఫోన్ : 9110568544

■ కృష్ణసాయి క్లాత్‌ఔట్ నందు పని చేయుటకు అనుభవం కలిగిన సేల్స్‌మెన్స్ & హెల్పర్స్ స్త్రీ/ పురుషులు కావలెను. మంచి జీతం, ఇంట్రస్ట్ ఉన్నవారు మాత్రమే సంప్ర॥ నాయర్ హోటల్ సెంటర్, లక్ష్మీపురం. 9652181228

■ Wanted Qualified Experienced Teachers Higher Classes 6th to 10th Maths, Hindi & Social New Kennedy High School, Mangalagiri.7993409110/9866685689

■ ప్రముఖ స్టార్ హోటల్ గీతా రీజెన్సీ నందు పని చేయుటకు రెస్టారెంట్ వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, మెయిడ్స్(లేడీస్), సూపర్‌వైజర్స్, కిచెన్ అసిస్టెంట్స్, సౌత్ ఇండియన్ మాస్టర్స్(చైనీస్) మరియు డ్రైవర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి మంచి జీతం ఇవ్వబడును. సంప్ర॥ 4/1, అరండల్‌పేట, గుంటూరు. 9849077525

■ మా సంస్థ నందు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ వర్క్ చేయుటకు యువతి/ యువకులు కావలెను. ఆకర్షణీయమైన సంపాదన. Cont: 7032856389

■ మంగళగిరి ఏరియాలో ప్రముఖ పురుగుమందుల కం॥లో మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ: డిగ్రీ, టూవీలర్ మస్ట్, జీతం: 10000+ TA+DA-3000 ✆ 81850 46367

■ Wanted Lady Mother Teacher for Classes (LKG, UKG, I, II) Also Wanted Tutions. Cont G.K.R. High School, Pattabhipuram 1st Line, GNT-6 Ph: 8897682399

■ సత్తెనపల్లి ఆఫీస్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కావలెను. Qul: 10th, ఇంటర్, డిగ్రీ మరియు Basic Computer Knowledge Ph: 7013894058

■ Wanted Male Campus Incharges, Male Marketing vice Principals and Executives. Qualification Any Degree, Must be Married. Salary upto: 20000/- Place of work. Master Minds College, Guntur. Conatct: 92487 33344

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15–28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 85026 15217

■ కర్నూలు నందు 200 మంది స్టూడెంట్స్ గల బాయ్స్ హాస్టల్లో పనిచేయుటకు హాస్టల్ వంటలో అనుభవమున్న భార్యాభర్తల జంట కావలెను. జీతం: 30,000/-. ఆసక్తి గలవారు సంప్ర: యుగంధర్ 99499 68477

■ ఒమేగా హోస్పేస్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, వంట/ఇంటిపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం20K ఫోన్ 8977639662 / 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గుర్తుంచగలరు.

వైద్య రంగ సమస్యలపై నిర్మాణాత్మక పోరాటాలు

- ప్రభుత్వ ఆధీనంలోనే విద్య, వైద్యం ఉండాలి
- ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెరగాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



జీజీహెచ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో పాల్గొన్న నేతలు

గుంటూరు మెడికల్: వైద్య రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు చెప్పారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభ గురువారం జరిగింది. గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్ సమావేశ మందిరంలో కోన అప్పారావు పేరుతో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో మహాసభను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో పాలకవర్గాల ఆలోచనా విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా ఉంటాయని విమర్శించారు. ఉద్యోగులు తమ సమస్యల కోసం పోరాటాలు చేస్తూనే సమాజ మార్పుకోసం కృషి చేయాలని సూచించారు. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచింది ప్రభుత్వ ఆధీనంలోని ఆసుపత్రులు, సిబ్బంది మాత్రమేనని కొనియాడారు. ఉద్యోగులు లేకుండా ప్రభుత్వాలు నడవడం కష్టతరమనే విషయాన్ని గ్రహించాలన్నారు.

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రభుత్వ ఉద్యోగులు మద్దతు పలకడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇంకా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడారు. అంతకుముందు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఏఐటీయూసీ జెండాను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకష్ణమూర్తి ఎగురవేశారు.

సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకష్ణమూర్తి, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

9 బంగారు గొలుసుల చోరీ

- షోరూం ఉద్యోగి పనే ● పోలీసులకు ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: తనిష్క్ బంగారు షాపులో తొమ్మిది బంగారు గొలుసులు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని తనిష్క్ షోరూమ్‌లో ఇటీవల ఆడిట్ నిర్వహించారు. ఆడిట్‌లో తొమ్మిది బంగారు గొలుసులు తగ్గాయి. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా షాపులో పనిచేసే వ్యక్తి 370 గ్రాముల బరువు ఉన్న తొమ్మిది బంగారు గొలుసులు చోరీ చేసినట్లు గుర్తించారు. స్టోర్ మేనేజర్ అరుణ్‌కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆఖరి చూపునకు చొరవ

- లండన్‌లో మృతి చెందిన సాయిరామ్ మృతదేహం ఈనెల 29న కోనూరు రాక
- రెండు దేశాల ప్రభుత్వాలను ఒప్పించిన స్నేహహస్తాలు ఫౌండేషన్



మృతుడు గుంటుపల్లి సాయిరాం(ఫైల్)

అచ్చంపేట: పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, కోనూరు గ్రామానికి చెందిన గుంటుపల్లి సాయిరాం(25)ఈనెల 2వ తేదీన లండన్‌లోని మాంచెస్టర్‌లోగల పాకిస్తాన్ పోర్ట్ బీచ్‌లో మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. తల్లి అన్నపూర్ణ, బంధువుల కోరిక మేరకు కడసారి చూపుకోసం మృతదేహాన్ని తమ సంస్థద్వారా ఈనెల 29న స్వగ్రామమైన కోనూరుకు తీసుకు రానున్నట్లు స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు గురువారం తెలిపారు. లండన్‌లో ఉంటున్న ప్రవాసాంధ్రుడు, స్నేహ హస్తాలు ఫౌండర్లలో ఒకరైన కూరపాటి శివరాం, తన స్నేహితుడు లండన్‌లో స్థిరపడి హాంప్‌షైర్ సిటీకి మేయర్‌గా ఎంపికైన తెలుగువాడు అరుణ్ ముమ్మలనేని ద్వారా సాయిరాం మృతదేహాన్ని స్వదేశమైన భారత్‌కు పంపేందుకు బ్రిటన్ ప్రభుత్వాన్ని ఒప్పించారు. భారత ప్రభుత్వ అనుమతులతో ఈనెల 29న సాయిరాం మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ రప్పించే ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, కోనూరు గ్రామానికి అంబులెన్స్ ద్వారా తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన సాయిరాం ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదివేందుకు 2021లో లండన్ వెళ్లాడు. గత మూడు సంవత్సరాలుగా అక్కడే ఉన్న సాయిరాం ఈనెల 2వ తేదీన అక్కడ బీచ్‌లో మృతి చెంది ఉండటాన్ని అక్కడి పోలీసులు గుర్తించారు. భారత సంతతి వ్యక్తిగా తెలుసుకున్న లండన్ పోలీసులు ఈనెల 10న ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం ద్వారా అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు వివరాలు పంపారు. తండ్రి గుంటుపల్లి ఏడుకొండలు గతంలోనే మృతి చెందగా, తల్లి అన్నపూర్ణ, బంధువులు కడసారి చూపు కోసం మృతదేహాన్ని చూపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అర్థించారు. దినపత్రికల ద్వారా విషయం తెలుసుకున్న లండన్‌లో ఉంటున్న స్నేహ హస్తాలు ఫౌండర్ శివరాం, అక్కడి సిటీ మేయరైన తన స్నేహితుని ద్వారా చొరవ చూపడంతో సాయిరాం మృతదేహం ఈనెల 29న స్వగ్రామమైన అచ్చంపేట మండలం, కోనూరు గ్రామానికి చేరుకోనుంది. స్నేహహస్తాలు ఫౌండేషన్‌కు సాయిరాం కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

పట్టపగలే బంగారం చోరీ

చినగంజాం (పర్చూరు): ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే చోరీ చేసిన ఘటన పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో గురువారం జరిగింది. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మర్రి జానకి అమెరికాలో కుమారుడి వద్దకు వెళ్లారు. ఈనెల 9వ తేదీన అక్కడకు వెళుతూ రోజూ ఇల్లు శుభ్రం చేయమని పని మనిషికి తాళాలు ఇచ్చారు. రోజు మాదిరిగానే శుభ్రం చేయడానికి వచ్చిన ఆమె ఇంటి తలుపులు తీసి ఉండటం చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. లోనికి వెళ్లి చూసే సరికే బీరువా తలుపులు తీసి ఉండటాన్ని గమనించి లబోదిబోమంది. వెంటనే బయటికి వచ్చి ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయం చెప్పింది. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను పిలిపించి ఆధారాలు సేకరించారు. అమెరికాలో ఉన్న మర్రి జానకీకి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. ఆమె వద్ద నుంచి వివరాల్ని సేకరించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు సవర్ల బంగారం వస్తువులు, మూడు కిలోల వెండి, రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు ఎస్ఐ రమేష్ నిర్ధారించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.